జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 17 ॥మంగళవారం ॥ 16-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



పారితోషికం పెంచిన త్రిష



# తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ

## బెల్లంపల్లిలో కవిత రాజకీయ గర్జన

### కాంగ్రెస్‌పై కవిత విమర్శలు

**బెల్లంపల్లి, జూన్ :**
టీఆర్ఎస్ సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురా లు కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

(మిగతా 2వ పేజీలో)



# హైదరాబాద్ భవిష్యత్తుకు మెట్రో కీలకం





## మెట్రో నిధుల విడుదల ఎక్కడ ఆగింది

## ఐఆర్ఎఫ్‌సీపై రేవంత్ రెడ్డి ప్రశ్నల వర్షం

## కేంద్రం స్పందించాలని డిమాండ్

– హైదరాబాద్, జూన్ 15:
హైదరాబాద్ మహానగర అభివృద్ధికి అత్యంత కీలకమై న మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టు విషయంలో నిధుల విడుదల నిలిచిపోవడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ అండ్ టీ నుంచి హైదరాబాద్ మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తయినా, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి నిధులు విడుదల కాకపోవడం వెనుక కారణాలు ఏమిటని ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ అంశంపై విస్తృతంగా మాట్లాడారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలంటే మెట్రో రైలు విస్తరణ తప్పనిసరి అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

తరువాయి 2 వ పేజీలో...



# రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తం

### 19 నుంచి భారీ వర్షాల హెచ్చరిక

### విపత్తుల నిర్వహణకు ముందస్తు చర్యలు

### అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 15**
రాష్ట్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అన్ని జిల్లాల అధికారులు పూర్తి స్థాయిలో అప్రమ త్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం రాష్ట్ర స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన

(మిగతా 2వ పేజీలో)

# తమిళ రాజకీయాల్లోకి లారెన్స్



## సానుకూల నిర్ణయం ప్రకటించిన నటుడు

**చెన్నై, జూన్ 15 :**
ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నా రనే ఊహాగానాలకు ఆయన తాజా వ్యాఖ్యలు మరి ంత బలం చేకూర్చాయి.ప్రజలు, అభిమానుల నుం చి వస్తున్న విస్తృత మద్దతు నేపథ్యంలో రాజకీయ ప్రవేశంపై తాను సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు లారెన్స్ వెల్లడించారు. త్వరలోనే దీనిపై పూర్తి స్థాయి ప్రకటన చేస్తానని స్పష్టం చేశారు. చెన్నైలోని తన నివాసంలో అభిమా నులతో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడిన లారెన్స్, రాజకీయాల్లోకి రావాలం టూ అనేక మంది కోరుతున్నారని తెలిపారు. ప్రజల నుంచి

(మిగతా 2వ పేజీలో)



## 8 మేలురకాల సాగుకు ప్రోత్సాహం

### ఎగుమతి వరితో రైతులకు బంగారు భవిష్యత్

- విదేశాల్లో తెలంగాణ బియ్యానికి డిమాండ్
- రైతుల ఆదాయం పెంపే లక్ష్యం

**హైదరాబాద్, జూన్ 15:**
అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉన్న మేలు రకం వరి వంగడాల సాగుపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రజాభవన్‌లో సోమవారం నిర్వహి ంచిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు కీలక ప్రతిపాదనలు వెలువడ్డాయి. ఈ సమావేశానికి వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై

(మిగతా 2వ పేజీలో)

# అమెరికా-ఇరాన్ ఒప్పందానికి మోదీ స్వాగతం

- పశ్చిమాసియాలో శాంతి ఆశలు
- దౌత్య చర్చలే పరిష్కారం
- స్థిరత్వం కోసం కీలక అడుగు

**పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు ముగింపు పలికే దిశగా అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందం అమలులోకి వస్తే ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం నెలకొనే అవకాశాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.**

**న్యూఢిల్లీ, జూన్ 15**
సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో స్పందించిన మోదీ, దశాబ్దాలుగా కొనసా గుతున్న విభేదాలకు చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమని పేర్కొ న్నారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రపం చ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని మోదీ గుర్తుచేశారు. ఇంధన ధరల పెరుగుదల, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, అంతర్జాతీయ వాణిజ్యం పై ప్రతికూల ప్రభావం వంటి అంశాలు అనేక దేశాలను ఇబ్బందులకు గురిచేశాయ ని ఆయన తెలిపారు. ఈ పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తం గా ఆర్థిక అనిశ్చితి పెరిగిందని అభిప్రాయపడ్డారు. అమెరికా, ఇరాన్ మధ్య

(మిగతా 2వ పేజీలో)





## ప్రపంచకప్ ఆర్చరీలో డబుల్ గోల్డ్ దేశానికి గర్వకారణం

లోపలి పేజీల్లో..

# నేటి రాశి ఫలాలు

**మేషం :** పరిస్థితులు కొంచెం మిశ్రమంగా ఉండవచ్చు. ముఖ్యమైన పనుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి. అనవసర ప్రయాణాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. నవగ్రహ ధ్యానం శుభప్రదం.

**వృషభం :** అనుకూలమైన కాలం కొనసాగుతోంది. మీ బుద్ధి, నిర్ణయశక్తి పనుల్లో సహాయపడుతుంది. ఉద్యోగం, వ్యాపారంలో పురోగతి కనిపిస్తుంది. కుటుంబంలో సంతోషకర వాతావరణం ఉంటుంది. పెద్దల సహాయం లభిస్తుంది. శుభకార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉంది. ఇష్టదేవతను ప్రార్థించడం మంచిది.

**మిథునం :** ఒక శుభవార్త మీ ఇంట్లో ఆనందాన్ని పెంచుతుంది. ఉద్యోగం, వ్యాపారంలో అనుకున్న పనులు సులభంగా పూర్తవుతాయి. అవసరమైనప్పుడు ఆర్థిక సహాయం లభిస్తుంది. మిత్రుల సహకారం ఉంటుంది. ఇష్టదేవత స్తోత్రం చదవడం మంచిది.

**కర్కాటకం :** పనుల్లో ఆటంకాలు రాకుండా ముందుగానే ఆలోచించి పనిచేయాలి. ఉద్యోగం, వ్యాపారంలో అధికారుల నుంచి సహకారం ఉంటుంది. ముఖ్యమైన విషయాల్లో నిర్ణయాలు తీసుకుంటారు. శివ స్తోత్రం చదవడం మంచిది.

**సింహం :** కుటుంబ సభ్యుల నుంచి బలమైన సహకారం ఉంటుంది. అవసరమైనప్పుడు ఆర్థిక సాయం లభిస్తుంది. ఉద్యోగం, వ్యాపారంలో అనుకూల ఫలితాలు ఉంటాయి. శ్రీలక్ష్మీ అష్టకం చదవడం శుభప్రదం.

**కన్య :** ఏకాగ్రతతో పనిచేస్తే లక్ష్యాన్ని చేరుకుంటారు. ఉద్యోగం, వ్యాపారంలో పురోగతి ఉంటుంది. ఆర్థికంగా అభివృద్ధి కనిపిస్తుంది. తోటివారితో మంచి అనుబంధం ఉంటుంది. స్థిరాస్తి సంబంధ విషయాలు అనుకూలంగా ఉండవచ్చు. ఇష్టదేవతను ప్రార్థించడం శుభకరం.

**తుల :** పనుల్లో ఏకాగ్రత అవసరం. కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగం, వ్యాపారంలో స్థిరంగా ముందుకు సాగుతారు. మనోధైర్యం తగ్గకుండా చూసుకోవాలి. ఇష్టదేవతను ప్రార్థించడం శ్రేయస్కరం.

**వృశ్చికం :** అనుకూల పరిస్థితులు కనిపిస్తాయి. పట్టుదలతో పనులను పూర్తిచేస్తారు. ఉద్యోగం, వ్యాపారంలో ప్రణాళికతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఒక శుభవార్త మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఖర్చుల్లో కొంత జాగ్రత్త అవసరం. ఇష్టదేవత ఆరాధన మంచిది.

**ధనుస్సు :** ఉద్యోగంలో మంచి ఫలితాలు కనిపిస్తాయి. వ్యాపారంలో లాభాలు రావచ్చు. కుటుంబంలో అనుకూల వాతావరణం ఉంటుంది. మీ కృషి ఫలిస్తుంది. ఈశ్వరారాధన చేయడం మంచిది.

**మకరం :** పనుల్లో ఎక్కువ శ్రమ పడకుండా జాగ్రత్త పడాలి. డబ్బు విషయాల్లో పొదుపుగా ఉండటం మంచిది. ఒక ముఖ్యమైన సమస్యను పరిష్కరించి ముందుకు సాగుతారు. శత్రువులపై విజయం సాధించే అవకాశం ఉంది. శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించడం శుభకరం.

**కుంభం :** ఫలితాలు కొంత మిశ్రమంగా ఉంటాయి. అయినా ప్రణాళికతో పనిచేస్తే పనులు పూర్తవుతాయి. ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి. అవసరం లేని విషయాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం మంచిది. నారాయణ మంత్రం జపించడం శుభప్రదం.

**మీనం :** శుభఫలితాలు పొందుతారు. మనోభీష్ట సిద్ధి ఉంది. ఉద్యోగం, వ్యాపార సంబంధ విషయాల్లో మంచి జరుగుతుంది. బంధువులతో ఆనందంగా గడుపుతారు. ఇష్టదైవాన్ని దర్శించడం శుభప్రదం.



# హైదరాబాద్ భవిష్యత్తుకు మెట్రో కీలకం



**హైదరాబాద్, జూన్ 15**

నగర జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు, కాలుష్యాన్ని నియంత్రించడానికి, ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి మెట్రోనే ఉత్తమ పరిష్కారమని అన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండో దశ మెట్రో విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకే ఎల్ అండ్ టీ నుంచి మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే నిర్ణయం తీసుకుందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. మెట్రో మొదటి దశను టేకోవర్ చేయకుండా రెండో దశ విస్తరణ సాధ్యం కాదని కేంద్రం సూచించడంతో ఆ దిశగా అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. ఎల్ అండ్ టీతో సుదీర్ఘ చర్చల అనంతరం సుమారు రూ.30 వేల కోట్ల విలువైన మెట్రో ఆస్తులను రూ.15 వేల కోట్లకు స్వాధీనం చేసుకునే ఒప్పందం కుదిరిందన్నారు. మెట్రో స్వాధీనం కోసం అవసరమైన రూ.13,600 కోట్ల రుణానికి ఐఆర్ఎఫ్‌సీతో ఒప్పందం కుదుర్చుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను చెల్లించడంతో పాటు రిజర్వ్ బ్యాంక్ కౌంటర్ గ్యారంటీ కూడా సమర్పించిందని చెప్పారు. ఒప్పందానికి సంబంధించిన అన్ని నిబంధనలు పూర్తి చేసినప్పటికీ నిధుల విడుదల మాత్రం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.జపాన్‌కు చెందిన ఆర్థిక సంస్థ నుంచి నిధులు ఇప్పటికే ఐఆర్ఎఫ్‌సీ ఖాతాలో జమ అయ్యాయని సీఎం వెల్లడించారు. ఒప్పందం ప్రకారం సోమవారం నిధులు విడుదల కావాల్సి ఉన్నప్పటికీ చివరి నిమిషంలో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఐఆర్ఎఫ్‌సీ ఖాతాలో నిధులు ఉన్నా ఎల్ అండ్ టీకి చెల్లింపులు జరగకపోవడం వెనుక కారణాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ మెట్రో చరిత్రను గుర్తు చేసిన ముఖ్యమంత్రి, 2009లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఒకప్పుడు దేశంలో ఢిల్లీ తర్వాత రెండో అతిపెద్ద మెట్రో వ్యవస్థగా హైదరాబాద్ నిలిచిందని, కానీ గత పదేళ్లలో విస్తరణ చేపట్టకపోవడం వల్ల ప్రస్తుతం వెనుకబడిపోయిందని పేర్కొన్నారు.

ప్రస్తుతం హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ జనాభా 1.34 కోట్లకు చేరుకుందని, ఈ పరిస్థితుల్లో మెట్రో విస్తరణ అత్యవసరమని సీఎం స్పష్టం చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాలను అనుసంధానం చేస్తూ సమగ్ర మెట్రో నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో, ఉద్యోగ అవకాశాల సృష్టిలో, నగర ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో మెట్రో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. గత ప్రభుత్వాలు అధిక వడ్డీ రేట్లతో రుణాలు తీసుకున్నప్పటికీ, మెట్రో స్వాధీనం కోసం కేవలం నాలుగు శాతం వడ్డీకే నిధులు సమీకరించామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం పడకుండా, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అయినప్పటికీ అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన తర్వాత కూడా నిధులు నిలిపివేయడం సమంజసం కాదన్నారు.

అన్ని రాష్ట్రాల్లో మెట్రో ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం యాభై శాతం వరకు ఆర్థిక సహకారం అందిస్తోందని, తెలంగాణ విషయంలో మాత్రం ఎందుకు భిన్నంగా వ్యవహరిస్తోందో స్పష్టం చేయాలని సీఎం ప్రశ్నించారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి ఈ అంశంపై జోక్యం చేసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నిరభ్యంతర పత్రం ఇస్తే కేంద్ర నిధులు లేకుండానే వంద శాతం రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీతో రెండో దశ మెట్రో విస్తరణ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాల కోసం చేపట్టిన ఈ ప్రాజెక్టును రాజకీయ కోణంలో చూడకూడదని, హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధి కోసం కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బెల్లంపల్లి నడిబొడ్డున తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేయడం గర్వంగా ఉందని కవిత పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆశీస్సులు తమకు కావాలని కోరుతూ, భవిష్యత్తులో ప్రజల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేసే రాజకీయ ప్రత్యామ్నాయంగా తెలంగాణ రక్షణ సేన నిలుస్తుందని చెప్పారు.స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ బెల్లంపల్లి ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని విమర్శించారు. రెండు నెలలకు ఒకసారి కూడా ప్రజలకు దర్శనం ఇవ్వడం లేదని ఆరోపించారు. పట్టణంలోని కోర్టు రహదారి అధ్వాన్నంగా మారినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని కవిత ఆరోపించారు. పెన్షన్ల పెంపు, రైతుల ధాన్యం కొనుగోలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. ఈ పరిస్థితులపై ప్రజలంతా కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.తెలంగాణ రక్షణ సేన ప్రధాన లక్ష్యాలను వివరిస్తూ 'పాంచజన్యం' పేరుతో ఐదు కీలక అంశాలను ముందుకు తీసుకువస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడమే కాకుండా యువతకు రెండు లక్షల రూపాయల నుంచి ఇరవై కోట్ల రూపాయల వరకు రుణాలు అందించే విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు గౌరవం కల్పించే పాలన అందిస్తామని కవిత స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, సామాజిక న్యాయం సాధించడం తమ పార్టీ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గంలో టీఆర్ఎస్ విజయాన్ని సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# .. రైతులకు బంగారు భవిష్యత్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర వ్యవసాయ రంగ పరిస్థితులు, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలు, వానాకాలం సాగు అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులకు అధిక లాభాలు అందించే ఎని మిది ప్రత్యేక వరి వంగడాలను ప్రోత్సహించాలని సూచించారు. బీపీటీ-5204,తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048), కేఎన్ ఎం-1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ, డబ్ల్యూజీఎల్-962, డబ్ల్యూ జీఎల్-44, జేఎల్‌జీ-1798 రకాల బియ్యానికి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ విశేష ఆదరణ ఉందని వివరించారు.అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో తెలంగాణ బియ్యానికి మంచి డిమాండ్ ఉన్నందున ఈ రకాల సాగు రైతులకు మరింత లాభదాయకంగా మారుతుందని తెలిపారు. మార్కెట్‌లో ఉన్న ఆదరణ కారణంగా ఈ రకాల బియ్యం ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంచడంలో ఈ వంగడాలు కీలక పాత్ర పోషి స్తాయని వివరించారు.ఈ ప్రత్యేక రకాల సాగుకు అవసరమైన విత్తనాల కొరత లేదని, రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా సాగు చేయ డానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. గ్రామస్థాయి లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను ప్రోత్సహి ంచాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశం లో సివిల్ సప్లై శాఖ అధికారులు కూడా పలు కీలక అంశాలను ప్రస్తావించారు.రాష్ట్రంలో సాగవుతున్న అన్ని రకాల సన్న బియ్యా నికి మార్కెట్‌లో సమాన స్థాయి లో డిమాండ్ లేదని తెలిపారు. కొన్ని రకాల ధాన్యం మిల్లింగ్ సమయంలో అధికంగా విరిగిపోవ డం, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా లేకపోవడం వల్ల మిల్లర్లు వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదని వివరించారు. డిమాండ్ ఉన్న రకాల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభిస్తాయని, మిల్లర్లు నేరుగా రైతుల వద్దకు వెళ్లి కొనుగోళ్లు చేసే పరిస్థితి ఏర్పడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. దీంతో రైతులకు లాభం చేకూరడమే కాకుండా వినియోగదారులకు నాణ్యమైన బియ్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి సురేందర్ మోహన్, వ్యవసాయ కమిషనర్ గోపీ, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ రాజ్, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాబోయే కాలంలో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు తెలంగాణ బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత బలోపేతం చేయాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.

# తమిళ రాజకీయాల్లోకి లారెన్స్

(మొదటి పేజీ తరువాయి)



లభిస్తున్న ప్రేమ, విశ్వాసం తనను ఆలోచింపజేసిందని పేర్కొన్నారు. అందుకే రాజకీయ భవిష్యత్తుపై ఒక నిర్ణయానికి వచ్చినట్లు వెల్లడించారు. అయితే తుది ప్రకటనను సరైన సమయంలో వెల్లడిస్తానని చెప్పారు.త్వరలో తన తల్లి, అభిమానులు, మద్దతుదారులతో కలిసి భారీ సమావేశం నిర్వహిం చనున్నట్లు లారెన్స్ తెలిపారు.ఆ సమావేశంలో తన రాజకీయ ప్రయాణానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తానని పేర్కొ న్నారు. దీంతో ఆయన ఏ పార్టీ తరఫున రాజకీయాల్లోకి వస్తారు, ఏ బాధ్యతలు చేపడతారనే అంశాలపై ఆసక్తి నెలకొంది. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి విజయ్ నాయకత్వంలోని పార్టీ ఘన విజయం సాధించింది. రెండు స్థానాల్లో విజయం సాధించిన విజయ్ ఒక నియోజకవర్గానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఆ స్థానం నుంచి రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశం ఉందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.గతంలో ఒక వీడియో సందేశం ద్వారా రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే అంశంపై ప్రజల అభిప్రాయాన్ని లారెన్స్ కోరారు. తన సేవా కార్యక్రమాలకు లభించిన మద్దతు, ప్రజల స్పందన తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఆ స్పందన ఆధారంగానే రాజకీయ ప్రవేశంపై ముందడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

# అమెరికా-ఇరాన్ ఒప్పందానికి మోదీ స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

కుదిరిన తాజా అవగాహన భవిష్యత్తులో మరింత సమగ్ర ఒప్పందానికి మార్గం సుగమం చేస్తుందని మోదీ పేర్కొన్నారు. ఇంకా పరిష్కారం కాని అంశాలపై కూడా ఇరు దేశాలు చర్చల ద్వారా ముందుకు సాగాలని సూచించారు. పరస్పర గౌరవం, విశ్వాసం ఆధారంగా జరిగే దౌత్య ప్రక్రియ ద్వారానే దీర్ఘకాలిక శాంతి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ ఒప్పందానికి సంబంధించి జూన్ 19న స్విట్జర్లాండ్‌లో అధికారిక సంతకాలు జరిగే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇరు దేశాలు శాంతి ఒప్పందంపై ఒక అవగాహనకు వచ్చిన నేపథ్యంలో ప్రపంచ దేశాల దృష్టి ఇప్పుడు ఆ ప్రక్రియపైనే కేంద్రీకృతమైంది. ఈ పరిణామం పశ్చిమాసియా రాజకీయ సమీకరణాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు.పశ్చిమాసియా పరిస్థితులపై భారత్ మొదటి నుంచే ప్రత్యేక దృష్టి సారించింది. ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడం వల్ల భారత ఇంధన అవసరాలు, వాణిజ్య ప్రయోజనాలు ప్రభావితమయ్యాయి. ఇటీవల జరిగిన ఘర్షణల్లో భారతీయులు కూడా ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగించిన అంశంగా నిలిచింది. ఈ నేపథ్యంలో శాంతి దిశగా జరుగుతున్న ప్రతి ప్రయత్నాన్ని భారత్ సానుకూలంగా స్వాగతిస్తోంది. భవిష్యత్తులో ఇరాన్ అణు కార్యక్రమం, గల్ఫ్ ప్రాంత భద్రత, సముద్ర మార్గాల రక్షణ వంటి కీలక అంశాలపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉందని మోదీ పేర్కొన్నారు. తాజా ఒప్పందం కేవలం రెండు దేశాల మధ్య అవగాహన మాత్రమే కాకుండా, మొత్తం పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, భద్రత, అభివృద్ధికి పునాది వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్వేత

# సంపాదకీయం

మంగళవారం 16-6-2026

## నేలవిడిచి సాము చేస్తున్న ప్రాంతీయ పార్టీలు!

కాంగ్రెస్ నుంచి విడివడి ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు అన్నీ మళ్లీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బిజెపి వ్యతిరేక పోరాటం బలోపేతం అవుతుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎందుకు అన్నారో కానీ, బిజెపిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్ బలోపేతం కావాలన్న ఉద్దేశ్యంతో అలా అని వుంటారు. రెండు పార్టీల వ్యవస్థ ఉండివుంటే ఇలాంటిదే జరుగుతుంది. ఇష్టమున్న పార్టీలు ఆ రెండు పార్టీల్లో చేరుతాయి. అది బిజెపి లేదా కాంగ్రెస్ కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యంలో ప్రాంతాయ పార్టీల పాత్రను తక్కువగా అంచనావేయలేం. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యంగా, నిరంకుశంగా చేస్తున్న పాలనకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం చూశాం. కమ్యూనిస్టులు పూర్తిగా బలహీనపడి, దేశంలో కమ్యూనిజం అంతం కావడంతో ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టలు తమ ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎన్టీఆర్ తిరుగుబాటు చేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడి ఇప్పటికీ బలంగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో ద్రవిడ పార్టీలపై యుద్ధం ప్రకటించిన టివికె పార్టీ ఏకంగా అధికారంలోకి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు మనుగడ సాగిస్తున్నాయి. ఆయా పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అయితే జరిగేది కాంగ్రెస్ బలోపేతం మాత్రమే. కాంగ్రెస్ దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీ. అక్కడ సోనియా, రాహుల్, ప్రియాంకల పెత్తనం తప్ప ఇతరులకు అఇకారం ఉండదు. పేరుకే ఖర్గే జాతీయ పార్టీ అధ్యక్షుడు.

ఆయన మాట కూడా చెట్టుబాటు కాదు. అలాంటి పార్టీలో ప్రాంతీయ పార్టీల విలీనం కావాలన్న ఆలోచన సరికాదు. దీంతో ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదు. అందువల్ల సంజయ్ రౌత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లేదు. ఇకపోతే కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపునిచ్చిన మోడీ కూడా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూడా బిజెపి ఏమీ చేయలేకపోతున్నది. దేశంలో ప్రజల ఆదరణ ఉన్నంత వరకు ఏ పార్టీ అయినా ఉంటుంది. బెంగాల్‌ను తీసుకుంటే ప్రాంతీయ పార్టీగా తృణమూల్ విఫలం అయ్యింది. ఒక ఆడబిడ్డ చేతిలో దేశ భద్రతకు భంగం ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోయిన కొద్దిరోజులకే చిన్నాభిన్నం అవుతోంది. ఇది స్వయంకృతంగా చూడాలి. అంతమాత్రాన కాంగ్రెస్‌లో విలీనం అయితే, భ్రష్టత్వం కాంగ్రెస్‌కు కూడా అంటుకుంటుంది. ఇకపోతే ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు బలమైన వాణిని వినిపించడం లేదు. అందుకే ఎన్‌డిఎ వైఫల్యాలపై గట్టిగా పోరాడ లేకపోతున్నాయి. అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు రాజకీయాలు నడుపుతున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచన చేయడం లేదు. దళితుల గురించి అన్ని పార్టీలు గొప్పలు చెబుతున్నా ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ పూర్తికాలం ముఖ్యమంత్రి అయిన దాఖలాలు లేవు. బెంగాల్లో గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ పరిపాలించినా అవకాశం దళితులకు దక్కలేదు. తమిళనాడులో డీఎంకే అధికారం కోల్పోయినప్పటికీ మరో ప్రాంతీయ పార్టీ అధికారం చేపట్టింది. కేరళలో అధికారం కోల్పోయాక ఇప్పుడు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా కనుమరుగయ్యే స్థితి కనబడు తున్నది. బిహార్‌లో ఆర్జేడీది అదే పరిస్థితి. ఒడిశాలో కూడా నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ అదే బాటలో ఉంది. ప్రాంతీయ పార్టీలు ప్రజల్లో బలంగా లేకపోవడం స్వార్థ చింతనతో పాలన చేయడం, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోక పోవడం వంటి కారణాలతో కనుమరుగు అవుతున్నాయి. ఉమ్మడి ఎపిలో, ఇప్పుడు విభజిత ఎపిలోతెలుగుదేశం పార్టీ ఇంకా గట్టిగా నిలబడి ఉందంటే అందుకు ప్రజల మద్దతు కారణమని చెప్పాలి.

వైఎస్ జగన్ ప్రాంతీయ పార్టీని ప్రజలు నమ్మి ఓటేస్తే ఆయన దానిని నిలబెట్టుకోలేక పోయారు. టిడిపి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కూడా ఫక్తు కుటుంబ పార్టీలుగా మారాయి. అలాగే తెలంగాణలో బిఆర్‌ఎస్ కూడా కేవలం కుటుంబ పార్టీగా మారింది. ఇలాంటి పార్టీలను ప్రజలు దీర్ఘకాలం నమ్మరని గుర్తించాలి. ఈ స్థితిలో ప్రాంతీయపార్టీలు మారాలి. సమాజంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకుని పోవాలి. ప్రజల ఎజెండాను తమ లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలి. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం ఉండాలి. ఆయా రాష్ట్రాల్లో పాలనలో భిన్నత్వం కనిపించాలి. అభివృద్ధిని ఆలంబనగా చేసుకుని ముందుకు సగాలి. లేకుంటే ఆయా పార్టీలను ప్రజలు విసిరి అవత పారేస్తారు. బెంగాల్లో అదే జరిగింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు భిన్నంగా పాలన సాగించాలి. ఆయా రాష్ట్రాలను అభివృద్ధిలో ముందు వరసలో నిలబెట్టాలి. జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలే నయమని నిరూపించాలి. ఈ ప్రయత్నంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. దళితులు,గిరిజనలు, బిసిలను రాజకీయంగా ఎంచుకుని వారిని ముందుకు నడిపించారు. ఓ రకంగా ఆయన విప్లవం సాధించారనే చెప్పాలి. అలాగే ఓటు బ్యాంక్ రాజకీయాలకు పోకుండా అభివృద్ధి రాజకీయాలను చేస్తే ప్రజలు తప్పకుండా ప్రాంతీచయ పార్టీలను ఆదరిస్తూనే ఉంటారు. ఎందుకంటే కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులకు స్వేచ్ఛ ఉండదు. జాతీయ పార్టీ కనుక ఢిల్లీ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ముందున్నది. చీమచిటుక్కుమన్నా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు చెప్పాల్సిందే. స్వతంత్ర నిర్ణయాలకు అక్కడ ఆస్కారం ఉండదు. ప్రాంతీయ పార్టీలు జాతీయ ప్రత్యామ్నాయంగా మారితేనే కాంగ్రెస్ , బిజెపిలకు కొంత చెక్ పడుతుంది.

# మెట్రో తేలేక మాపై ఏడుపా!

**71 సార్లు ఢిల్లీకి పోయినా కేంద్రం రేవంత్‌ను దేకడం లేదు**

**ఓటుకు నోటు భయంతోనే మోదీని ప్రశ్నించలేని అసమర్థత**

**రూ.30 వేల కోట్ల మెట్రో ఆస్తుల కోసమే ఎల్ అండ్ టీ కి బెదిరింపులు**

**మెట్రోను ఆగం చేసినందుకు ముక్కు నేల రాసి క్షమాపణ చెప్పాలి**

**సీఎం వ్యాఖ్యలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్**



హైదరాబాద్, జూన్ 15: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కి కేంద్రం నుంచి అనుమతులు, నిధులు సాధించలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అసమర్థతను ప్రతిపక్షంపై రుద్దుతూ కుప్పిగంతులు వేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెట్రో విస్తరణను బీఆర్ఎస్ అడ్డుకుంటోందంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మెట్రో సాధనలో అట్టర్ ఫ్లాప్ అయిన రేవంత్ రెడ్డి, తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ నీచమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

**ఓటుకు నోటు భయం, బీజేపీతో చీకటి ఒప్పందం**

యూపీ, అహ్మదాబాద్, వైజాగ్ వంటి నగరాలకు కేంద్రం మెట్రోలు మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తీసుకురాలేకపోయారో ముందుగా సీఎం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తనపై ఉన్న ఓటుకు నోటు కేసు ఉచ్చు బిగుస్తుందనే భయంతోనే బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారు. ప్రధాని మోదీని ప్రశ్నించే సత్తా, ధైర్యం లేకనే రాష్ట్రంలోని ప్రతిపక్షంపై బురద జల్లుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. 71 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా బడే భాయ్ అంటూ మోకరిల్లినా కేంద్రం రేవంత్‌ను దేకడం లేదని, ఇది దద్దమ్మ పాలనకు నిలువెత్తు నిదర్శనమని అని కేటీఆర్ విమర్శించారు.

**ఆస్తుల కోసమే ఎల్ అండ్ టీ కి బెదిరింపులు**

ఫేజ్-2 నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థ అంగీకరించలేదన్న సీఎం వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఎల్ అండ్ టీ సీఎఫ్ఓను స్వయంగా బెదిరించి, పారిశ్రామికవేత్తల తలకు తుపాకీ పెట్టినట్లుగా భయభ్రాంతులకు గురిచేసి ఆ సంస్థను పారిపోయేలా చేసింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వమేనని సంచలన ఆరోపణలు చేశారు. రూ. 30 వేల కోట్ల మెట్రో ఆస్తులను, నగర నడిబొడ్డున ఉన్న మెట్రో భూములను కొల్లగొట్టేందుకే రేవంత్ ఈ కుట్ర పన్నారని, కాసుల కక్కుర్తి కోసం మెట్రో భవిష్యత్తును పణంగా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మెట్రో ఘనత ముమ్మాటికీ కేసీఆర్‌దే**

గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 28 శాతం పనులు మాత్రమే చేసి ప్రాజెక్టును చిక్కుల్లో పడేస్తే.. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కేసీఆర్ చొరవ తీసుకుని మిగతా 72 శాతం పనులను పూర్తి చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కేంద్రం సహకరించకపోయినా మెట్రోను పరుగులు పెట్టించిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి నిధులు రాకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని చెప్పడం అంటే.. ప్రధాని మోదీ కన్నా కేసీఆర్ గారే పవర్ ఫుల్ అని సీఎం పరోక్షంగా ఒప్పుకున్నట్లే కదా? రద్దీగా ఉండే ఆరు రూట్లలో కేసీఆర్ ఫేజ్-2 డిజైన్ చేస్తే.. వాటిని కాదని, ఉనికిలోనే లేని ఊహా నగరానికి తన స్వార్థ ప్రయోజనాల కోసం రేవంత్ మెట్రో అంటున్నాడు. మెట్రోను ఆగం చేస్తున్నందుకు సీఎం వెంటనే ముక్కు నేలకు రాసి హైదరాబాద్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి.. లేకపోతే కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ పుట్టగతులు ఉండవు అని కేటీఆర్ హెచ్చరించారు.



# ఆ కలెక్టర్ల చిట్టా తీయండి!

**క్షేత్రస్థాయికి వెళ్లని అధికారులపై నివేదిక ఇవ్వాలని సీఎస్ కు ఆదేశం**

**విద్యా, వైద్య శాఖల్లో ఇక నుంచి ఫేషియల్ రికగ్నిషన్ హాజరు**

**జిల్లాల సమీక్షలకు స్పెషల్ ఆఫీసర్లుగా సీనియర్ ఐఏఎస్‌లు**

**లబ్ధిదారులు, అభివృద్ధి పనుల వివరాలతో డ్యాష్ బోర్డులు**

**సీఎం హామీల పురోగతిపై ప్రణాళికా విభాగం నివేదిక ఇవ్వాలి**

**99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై సీఎం రేవంత్ సమీక్ష**





హైదరాబాద్, జూన్ 15: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. మార్చి 16 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమాలపై ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరును అభినందిస్తూనే, భవిష్యత్ కార్యాచరణపై సీఎం దిశానిర్దేశం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠినంగా వ్యవహరిస్తామని పరోక్షంగా హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ల వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని గతంలోనే ఆదేశించామని సీఎం గుర్తుచేశారు. ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తక్షణమే తనకు నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రి ఆదేశించారు.

**ఉద్యోగులందరికీ ఫేషియల్ రికగ్నిషన్**

ప్రజలకు అత్యంత కీలకమైన విద్యా, వైద్య విభాగాల్లో పారదర్శకత పెంచేందుకు హాజరు విధానంలో మార్పులు తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, అలాగే పీహెచ్‌సీల నుంచి ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ ఆసుపత్రుల వరకు ఉద్యోగులందరికీ అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇంకా గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలు ఏవైనా ఉంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేసి, అక్కడ కొత్త భవనాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యుత్ అవసరాలు తీర్చేందుకు అన్ని స్కూల్ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయిలో 99 రోజుల ప్రణాళికపై సమీక్ష జరిగిన తరహాలోనే, ప్రతి జిల్లాలోనూ వెంటనే సమీక్షలు జరగాలన్నారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించి పంపాలని, జిల్లాల వారీగా ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాల వారీగా పథకాల లబ్ధిదారులు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో ఒక పారదర్శకమైన డ్యాష్ బోర్డును అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు.

**హామీల అమలు ఎంతవరకు వచ్చింది?**

తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనల్లో, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరుపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ఆయా హామీల పురోగతిపై తక్షణమే నివేదిక ఇవ్వాలని ప్రణాళికా విభాగాన్ని ఆదేశించారు. అలాగే, ప్రజాపాలనలో ప్రజల నుంచి, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను నమోదు చేసి క్షేత్రస్థాయి సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ రికార్డు చేయాలని చెప్పారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 24 ఫిర్యాదులు

**మల్కాజిగిరి, జూన్ 15**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే ప్రజావాణి కార్యక్రమం సోమవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 24 దరఖాస్తులు అందాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన 10 వినతులు, ఇంజినీరింగ్ శాఖకు చెందిన 9 ఫిర్యాదులు, పశువైద్య విభాగానికి సంబంధించిన 2 దరఖాస్తులు, పారిశుధ్య శాఖకు సంబంధించిన 2 వినతులు, పరిపాలన విభాగానికి సంబంధించిన ఒక దరఖాస్తు నమోదయ్యాయి. ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అందిన ప్రతి ఫిర్యాదుపై సంబంధిత శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అలాగే ప్రతి దశలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కేవలం ఫిర్యాదుల స్వీకరణ వేదిక మాత్రమే కాదని, ప్రజలకు జవాబుదారీతనం కలిగిన పాలన అందించేందుకు ఒక ముఖ్యమైన వ్యవస్థ అని అధికారులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినడం ద్వారా వాటికి వేగంగా పరిష్కారం చూపే అవకాశం



లభిస్తుందని తెలిపారు. పారదర్శక పాలన, ప్రజల విశ్వాసం, సమర్థవంతమైన పరిపాలనకు ప్రజావాణి కార్యక్రమం కీలకంగా నిలుస్తోందని మున్సిపల్ అధికారులు అభిప్రాయపడ్డారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులు నగర అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను కేంద్రబిందువుగా చేసుకుని మల్కాజిగిరిని మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు

**గద్వాల, జూన్ 15**



ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారని, విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన, పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ ఉపాధ్యాయుల వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు చదువుతున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా పర్యవేక్షణ బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం విద్యార్థులతో ప్రత్యేక మధ్యాహ్న భోజన కమిటీని ఏర్పాటు చేసి భోజన నాణ్యతను పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాల నిర్వహణలో విద్యార్థుల భాగస్వామ్యం కూడా పెరగాలని అభిప్రాయపడ్డారు. తరగతి గదులు, పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతమైన విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్, వెనుకబడిన అంశాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని సూచించారు. బలహీనంగా ఉన్న సబ్జెక్టుల్లో అదనపు సాధన చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. గత ఏడాది టాపర్ల మార్కులను అధిగమించే లక్ష్యంతో చదువుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు వేసవి సెలవులను ఎలా సద్వినియోగం చేసుకున్నారో అడిగి తెలుసుకున్న కలెక్టర్, సమ్మర్ స్పెషల్ తరగతులకు హాజరైన వారి వివరాలను పరిశీలించారు.

# ప్రజావాణిలో 97 ఫిర్యాదులు

**సైబరాబాద్, జూన్ 15**



ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో నిర్వహిస్తున్న సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ స్వయంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి వినతిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ ప్రాధాన్యత ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజావాణిలో మొత్తం 97 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో అత్యధికంగా పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన 77 వినతులు నమోదయ్యాయి. ఇంజినీరింగ్ శాఖకు 8, పారిశుధ్య శాఖకు 3, సరస్సుల విభాగానికి 2, రెవెన్యూ శాఖకు 2, పట్టణ జీవవైవిధ్య విభాగానికి 2 ఫిర్యాదులు అందాయి. ఆర్థిక, రవాణా, పట్టణ సమాజాభివృద్ధి శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు నమోదయ్యాయి. ప్రతి ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించినట్లు అధికారులు తెలిపారు. సమస్యల స్వరూపాన్ని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం మున్సిపల్ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో క్షేత్రస్థాయి బృందాలతో సమన్వయం పెంచాలని అధికారులకు సూచించారు. ప్రతి కేసును నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించాలన్నారు.

# రోడ్డు భద్రతకు ప్రత్యేక కార్యాచరణ



**జనగామ, జూన్ 15**

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి నిర్వహించిన రహదారి భద్రత సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని జాతీయ రహదారులపై భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేసి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా గోవర్ధనగిరి జంక్షన్ వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిల వద్ద భద్రతా ఏర్పాట్లు మెరుగుపరచి ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని సూచించారు.

# ఈజీ మనీ ఆశిస్తే మోసమే

**హైదరాబాద్, జూన్ 15**

తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదిస్తామని చెప్పే ఆన్‌లైన్ మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. "ఈజీ మనీ" పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక సూచనలు జారీ చేశారు. సామాజిక మాధ్యమాలు, మెసేజింగ్ యాప్‌లు, తెలియని వెబ్‌సైట్ల ద్వారా కొందరు మోసగాళ్లు ఆకర్షణీయమైన ఆఫర్లతో ప్రజలను వలలో వేసుకుంటున్నారని పోలీసులు తెలిపారు. ఇంటి వద్ద నుంచే పని చేస్తూ భారీ ఆదాయం సంపాదించవచ్చని, చిన్న పెట్టుబడితో పెద్ద లాభాలు వస్తాయని నమ్మించి డబ్బులు కాజేస్తున్నారని పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టిన వెంటనే అధిక లాభాలు వస్తాయని చెప్పే ప్రకటనలను నమ్మవద్దని పోలీసులు సూచించారు. ముఖ్యంగా తెలియని వ్యక్తులు పంపే లింకులు, సందేశాలు, పెట్టుబడి ఆఫర్ల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మోసగాళ్లు మొదట చిన్న మొత్తంలో లాభాలు చూపించి తర్వాత భారీ మొత్తాలు వసూలు చేసే అవకాశం ఉంటుందని వివరించారు. ఎలాంటి పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థ విశ్వసనీయతను పూర్తిగా పరిశీలించాలని సూచించారు.

# ప్రజావాణితో రైతుకు న్యాయం

**జనగామ, జూన్ 15**

ప్రజల సమస్యలను నేరుగా విని వేగంగా పరిష్కరించే ప్రజావాణి కార్యక్రమం మరోసారి సామాన్యుడికి న్యాయం అందించింది. ఏళ్ల తరబడి పరిష్కారం కోసం ఎదురు చూసిన భూ వివాదానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతో ముగింపు లభించడంతో జనగామ మండలం శామీర్‌పేట గ్రామానికి చెందిన రైతు బడుక రాంచందర్ ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాంచందర్‌కు చెందిన 23 గుంటల భూమి కొన్ని సంవత్సరాల



క్రితం అక్రమంగా మరో వ్యక్తి పేరుపై బదిలీ కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ సమస్యపై పలుమార్లు అధికారులను సంప్రదించినప్పటికీ పరిష్కారం లభించకపోవడంతో నిరాశకు గురయ్యారు. భూమి తిరిగి తన పేరుపై నమోదు కావాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో గత నెలలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాంచందర్ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి తన సమస్యను వివరించారు. సంబంధిత పత్రాలు సమర్పిస్తూ న్యాయం చేయాలని కోరారు. సమస్య తీవ్రతను గుర్తించిన కలెక్టర్ వెంటనే స్పందించి రెవెన్యూ అధికారులకు సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాత పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, రెవెన్యూ నమోదు రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించారు.



# నూతన బేకరీ ప్రారంభం

**ఎమ్మెల్యే వివేకానంద్ చేతుల మీదుగా ప్రారంభం**

**హైదరాబాద్, జూన్ 15**

నగరంలోని 125వ గాజుల రామారం డివిజన్ పరిధిలోని మహాదేవపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన "ది బేక్ హౌస్" స్వీట్స్ అండ్ బేకరీను బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. బాబు మహేష్, అభినయ్, దుర్గ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ బేకరీని సోమవారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఉపాధి కల్పనతో పాటు స్థానిక ఆర్థికాభివృద్ధికి ఇలాంటి వ్యాపార సంస్థలు దోహదపడతాయని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించి మంచి పేరు సంపాదించాలని నిర్వాహకులకు సూచించారు. స్థానిక ప్రాంతాల్లో కొత్త వ్యాపార సంస్థల ఏర్పాటు వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, చిన్న వ్యాపారాలను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే వివరించారు.




# కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

**ఆసిఫాబాద్, జూన్ 15**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. సోమవారం కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, కేసుల పురోగతిని సమీక్షించారు. తనిఖీ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను ఎస్పీ పరిశీలించారు. కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ వ్యవహారాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసును నిబంధనలకు అనుగుణంగా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన నిఘా ఉంచాలని స్టేషన్ హౌస్ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంపై కూడా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# నీట్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఆదిలాబాద్, జూన్ 15**

నీట్--2026 పరీక్షను జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి నిర్వహించిన సమన్వయ సమావేశంలో పరీక్ష నిర్వహణకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రతిష్ఠాత్మక వైద్య ప్రవేశ పరీక్ష అయిన నీట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, రవాణా, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# రాష్ట్ర శ్రేయస్సు కోసం రుద్రాభిషేకం

## లోకేష్-బ్రాహ్మణి దంపతుల ప్రత్యేక పూజలు

## మహాశివుడికి ఏకాదశ రుద్రాభిషేకం

## ప్రజా సంక్షేమం కోసం ప్రార్థనలు

**హైదరాబాద్, జూన్ 15**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలు, సంక్షేమం కోసం విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. పరమేశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన సోమవారం సందర్భంగా నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేపట్టారు. వేద పండితులు మహాన్యాస పూర్వకంగా రుద్రాభిషేకాన్ని నిర్వహించగా, లోకేష్--బ్రాహ్మణి దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. రాష్ట్రంలో శాంతి, సౌభాగ్యం, సమృద్ధి నెలకొనాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని వారు ప్రార్థించారు. అలాగే రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, రైతులు, విద్యార్థులు, మహిళలు అభ్యున్నతి సాధించాలని సంకల్పించారు.

రుద్రాభిషేకం సందర్భంగా మహాశివుడికి పాలు, పన్నీరు, తేనె, గంధం, పుష్పాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు రుద్రం, చమకం, శివ స్తోత్రాలను పారాయణం చేస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హిందూ సంప్రదాయంలో రుద్రాభిషేకానికి విశిష్ట స్థానం ఉందని పండితులు తెలిపారు. ఈ పూజలు నిర్వహించడం ద్వారా ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి, సౌఖ్యాలు కలుగుతాయని విశ్వాసం. ముఖ్యంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక క్రతువుగా భావిస్తారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, సమాజ శ్రేయస్సు కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. కార్యక్రమం అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించి రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రోచ్చారణలు నిర్వహించారు.



# ధర్మవరం ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్ష

**ధర్మవరం, జూన్ 15**

ధర్మవరం ఏరియా ఆసుపత్రిని మరింత ఆధునిక వైద్య సేవలు అందించే కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో పాల్గొన్న ఆయన, ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, రోగుల అవసరాలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ఆరోగ్య సేవల నాణ్యత పెంపుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అంటువ్యాధులు కాని దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స కోసం పనిచేస్తున్న ఎన్‌సీడీ క్లినిక్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పోలియో రహిత జనగామకు పటిష్ట కార్యాచరణ

**జనగామ, జూన్ 15**



జిల్లాలో ఒక్క చిన్నారి కూడా పోలియో టీకాకు దూరం కాకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం--2026 విజ యవంతానికి అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేసి పోలియో రహిత జనగామ లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సున్నా నుంచి ఐదేళ్ల వయస్సు గల 33,651 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. అదనంగా జిల్లాలో ఉన్న 277 మంది వలస పిల్లలను కూడా గుర్తించి వారికి టీకాలు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్ల డించారు. జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన చిన్నారిని కార్యక్ర మంలో భాగస్వామ్యం చేయాలని అధికారులను ఆదేశిం చారు. పల్స్ పోలియో కార్యక్ర మం కోసం జిల్లాలో 293 పోలి యో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. అలాగే 29 రూట్లు, 29 రూట్ సూపర్వైజర్లు, 16 మొబైల్ బృందా లను నియ మించినట్లు తెలిపారు. ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి టీకా కార్యక్రమాన్ని విస్తృ తంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 94 అధిక ప్రమాద ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమం కోసం మొత్తం 1,172 మంది టీకా సిబ్బందిని నియమించగా, ప్రతి పోలియో బూత్ వద్ద నలుగురు సిబ్బంది విధులు నిర్వహించనున్నారని తెలిపారు. అదనంగా 15 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రయాణికుల పిల్లలకు కూడా పోలియో చుక్కలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

# రెండేళ్ల పాలన.. ప్రజల విశ్వాసమే బలం

**విజయనగరం, జూన్ 15**



ప్రజల ఆశయాలకు అనుగు ణంగా అభివృద్ధి, సంక్షేమాన్ని సమ న్వయం చేస్తూ కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసిందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయ నగరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" విజయోత్సవ సభలో పాల్గొన్న ఆమె, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి అతిపెద్ద బలమని పేర్కొన్నారు. గత రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు లక్షలాది కుటుంబాలకు భరోసా కల్పించాయని ఆమె తెలిపారు. మహిళలు, రైతులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు వంటి అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టి లో పెట్టుకుని ప్రభు త్వం ముందుకు సాగుతోంద న్నారు. అభివృద్ధి ఫలాలు సమాజం లోని ప్రతి వర్గానికీ చేరాలనే లక్ష్యం తోపాలన కొనసాగు తోందని చెప్పారు. యువత రాష్ట్ర భవిష్య త్తుకు మూలస్తం భమని పేర్కొన్న మంత్రి, వారికి ఉ పాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. పరిశ్రమల ప్రోత్సా హం, పెట్టుబ డుల ఆకర్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువత కు కొత్త అవకాశాలు సృష్టిస్తున్నామని వివరించారు. ఉద్యోగాలు మాత్రమే కాకుండా స్వయం ఉ పాధి అవకాశాలు కూడా పెంచుతున్నామని చెప్పారు.



# సమయస్ఫూర్తితో బాలుడి ప్రాణరక్షణ

**బాపట్ల, జూన్ 15**

బాపట్ల జిల్లా వడారెవు బీచ్‌లో చోటుచేసుకున్న ప్రమాద ఘటనలో మెరైన్ పోలీసుల అప్రమత్తత, స్థానిక ఈతగాళ్ల సమయస్ఫూర్తి ఓ బాలుడి ప్రాణాలను కాపాడిం ది. సముద్రంలో కొట్టుకుపోతున్న 17 ఏళ్ల అఖిలేష్‌ను సాహసోపేతంగా రక్షించి సీపీఆర్ అందించడం ద్వారా సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. వివరాల ప్రకా రం, అఖిలేష్ వడారెవు బీచ్‌లో స్నానం చేస్తున్న సమయం లో అలల ఉద్ధృతికి సముద్రం లోపలికి కొట్టుకుపోయాడు. బాలుడు ప్రమాదంలో చిక్కుకున్నట్లు గుర్తించిన మెరైన్ కానిస్టేబుల్ ఎడుకొండలు వెంటనే స్పందించి స్థానిక ఈతగాళ్ల సహాయంతో రక్షణ చర్యలు చేపట్టారు. అలలను ఎదుర్కొంటూ సముద్రంలోకి వెళ్లిన బృందం అఖిలేష్‌ను బయటకు తీసుకువచ్చింది. అప్పటికే బాలుడు అపస్మారక స్థితిలో ఉండటంతో మెరైన్ కానిస్టేబుల్ ఎడుకొండలు వెంటనే సీపీఆర్ నిర్వహించారు. కొద్దిసేపటి ప్రయత్నం అనంతరం బాలుడు స్పందించడంతో అక్కడ ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. తర్వాత అఖిలేష్‌ను మెరుగైన వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమయంలో ధైర్యంగా వ్యవహరించిన మెరైన్ పోలీసు సిబ్బంది, స్థానిక ఈతగాళ్లను ప్రజలు అభినందిస్తున్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అలల తీవ్రత, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ భద్రతా నియమాలను పాటించాలని హెచ్చరించారు.

# కోర్టులో విజయ్ కుటుంబ వ్యవహారం

**చెంగల్పట్టు, జూన్ 15**

తమిళనాడు ముఖ్యమంత్రి, సినీ నటుడు విజయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విడాకుల వ్యవహారం మరోసారి వార్తల్లో నిలిచింది. ఆయన భార్య సంగీత స్వర్ణలింగం దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌పై సోమ వారం చెంగల్పట్టు మహిళా కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు ప్రాథమికంగా విన్న న్యాయస్థానం కేసు తదుపరి విచారణను ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేసింది. కొంతకాలంగా విజయ్, సంగీత మధ్య విభేదాలు ఉన్నాయని తమిళ సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే సంగీత కోర్టును ఆశ్రయించి తమ వైవాహిక బంధాన్ని రద్దు చేయాలని కోరారు. తన పిటిషన్‌లో కుటుంబ జీవితాన్ని ప్రభావితం చేసిన అనేక అంశాలను ఆమె ప్రస్తావించినట్లు సమాచారం. భర్త ప్రవర్తన కారణంగా మానసికంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నానని ఆమె పేర్కొన్నట్లు న్యాయవర్గాలు చెబుతున్నాయి. సంగీత చేసిన ఆరోపణల్లో వివాహేతర సంబంధం అంశం ప్రధానంగా నిలిచింది. ఒక సినీ నటితో విజయ్ సన్నిహి తంగా ఉంటున్నారని, ఈ విషయం గురించి పలుమార్లు మాట్లాడినా పరిస్థితిలో మార్పు కనిపించలేదని ఆమె ఆరోపించినట్లు తెలిసింది. కుటుంబ గౌరవానికి భంగం కలిగే విధంగా కొన్ని పరిణామాలు చోటుచేసుకున్నాయని కూడా పిటిషన్‌లో ప్రస్తావించినట్లు సమాచారం. అంతేకా కుండా కుటుంబ ఆర్థిక వ్యవహారాల్లోనూ తనకు ఇబ్బందు లు ఎదురయ్యాయని సంగీత ఆరోపించారు.



# బావిలో పడిన వ్యాన్.. 8 మంది దుర్మరణం

**పంఢరపూర్, జూన్ 15**

మహారాష్ట్రలోని పంఢరపూర్ ప్రాంతంలో సోమవారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. 14 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఒక పికప్ వ్యాన్ అదుపుతప్పి రహదారి పక్కనున్న బావిలో పడిపోవడంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బావిలో పడిన వాహనాన్ని వెలికి తీసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బాధితులను రక్షించేందుకు గంటల తరబడి శ్రమించిన ప్పటికీ ఎనిమిది మందిని కాపాడలేకపోయారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదం స్థానికులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. కుటుంబ సభ్యుల రోదనలు అక్కడి వాతావరణాన్ని మరింత విషాదభరితంగా మార్చాయి. ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్య మాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. ఆ దృశ్యాలను చూసిన నెటిజన్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ ప్రమాద కారణాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. ప్రాథమికంగా వాహనం అదుపు తప్పడమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

వాహనం వేగం, రహదారి పరిస్థితులు, సాంకేతిక లోపాలు వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. ఈ దుర్ఘటన మహారాష్ట్రలో విషాద ఛాయలు నింపింది. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తగిన సహాయం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



# మహిళా, గిరిజన సంక్షేమంలో రెండేళ్ల ప్రగతి

**అమరావతి, జూన్ 15**

రాష్ట్రంలో గత రెండేళ్ల కాలంలో మహిళా, శిశు, గిరిజన సంక్షేమ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు మహిళల సాధికా రత, చిన్నారుల సమగ్ర అభివృద్ధి, గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతం గా అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. మహిళల భద్రత, ఆరోగ్యం, విద్య, ఉపాధి రంగాల్లో సమగ్ర విధానాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. శిశు సంక్షేమ రంగంలో అంగన్‌వాడీ సేవల విస్తరణ, పోషకాహార కార్యక్రమాల బలోపేతం, ప్రీ-స్కూల్ విద్యా సదుపాయాల మెరుగుదల వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, విద్య, పోషణపై ప్రత్యేక శ్రద్ధతో అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతు న్నాయని వెల్లడించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, వసతి సదుపాయాలు, ఆరోగ్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఉ పాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సంక్షేమం నుంచి సాధికారత వైపు, భద్రత నుంచి సమగ్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి స్పష్టంచేశారు.



# తంగిరాల ప్రభాకర్‌రావుకు ఘన నివాళి

**కీసర, జూన్ 15**

దివంగత మాజీ శాసనసభ్యులు, కీర్తిశేషులు తంగిరాల ప్రభాకర్‌రావు 12వ వర్ధంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహాన్ని సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. కంచికచర్ల మండలంలోని కీసర గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శ్రీనివాస్ (చిన్ని), తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు తంగిరాల ప్రభాకర్‌రావు ప్రజా జీవితాన్ని స్మరించుకున్నారు. సాధారణ కుటుంబం నుంచి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ప్రజానాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఎంపీపీగా, జడ్పీటీసీగా, అనంతరం శాసనసభ్యుడిగా ప్రజలకు సేవలందించిన ప్రభాకర్‌రావు రాజకీయ జీవితాన్ని నేతలు గుర్తు చేశారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు విద్యా సహాయం అందించడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా ఆయన ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. తంగిరాల ప్రభాకర్‌రావు సేవలు ఒక వ్యక్తి జీవితానికే పరిమితం కాలేదని, ప్రజాసేవకు ఆయన నిలిచిన ఆదర్శం నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు.



## మడత ఐఫోన్‌పై ఆపిల్
# ఫోకస్

కుపర్టినో, జూన్ 15

సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలకు మారుపేరైన ఆపిల్ సంస్థ, వినియోగదారులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రెండు కీలక ఉత్పత్తుల అభివృద్ధిపై వేగంగా ముందుకెళ్తున్నట్లు సమాచారం. మడతపెట్టే ఐఫోన్‌తో పాటు టచ్‌స్క్రీన్ సదుపాయం కలిగిన మ్యాక్‌బుక్‌ను రూపొందించే పనిలో సంస్థ నిమగ్నమై ఉన్నట్లు అంతర్జాతీయ సాంకేతిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రఖ్యాత సాంకేతిక విశ్లేషకుడు మార్క్ గుర్మన్ వెల్లడించిన వివరాల ప్రకారం, రానున్న సాఫ్ట్‌వేర్ వెర్షన్లలో గుర్తించిన కోడింగ్ ఆధారాలు ఈ ఉత్పత్తుల అభివృద్ధికి బలమైన సంకేతాలుగా కనిపిస్తున్నాయి. దీంతో ఆపిల్ తదుపరి తరం పరికరాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మడతపెట్టే ఐఫోన్ విషయంలో ఆపిల్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న మడత ఫోన్లలో కనిపించే మడత గీత సమస్యను పూర్తిగా తొలగించే లక్ష్యంతో సంస్థ పనిచేస్తున్నట్లు సమాచారం. ఫోన్‌ను పూర్తిగా విప్పినప్పుడు అది చిన్న ట్యాబ్లెట్ పరిమాణంలో కనిపించేలా రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది. వినియోగదారు ఫోన్‌ను మడిచే విధానాన్ని బట్టి తెరపై కనిపించే అంశాలు స్వయంచాలకంగా మారే సదుపాయం కూడా ఉండనుంది.




## రైల్వే టికెట్ బుకింగ్‌కు
# కొత్త వెబ్‌సైట్

న్యూఢిల్లీ, జూన్ 15

రైల్వే ప్రయాణికులకు కేంద్ర రైల్వే శాఖ శుభవార్త అందించింది. టికెట్ బుకింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి భారతీయ రైల్వే ఆహార, పర్యాటక సంస్థ కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. జులై 15 నాటికి ఈ కొత్త వేదికను ప్రారంభించనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ప్రస్తుతం టికెట్ బుకింగ్ సమయంలో వెబ్‌సైట్ నెమ్మదించడం, అధిక రద్దీ కారణంగా సర్వర్ సమస్యలు తలెత్తడం, తత్కాల్ బుకింగ్ సమయంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురవడం వంటి ఫిర్యాదులు తరచూ వినిపిస్తున్నాయి. కొత్త వెబ్‌సైట్ ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైల్వే శాఖ చెబుతోంది. కొత్త వ్యవస్థలో అధిక సంఖ్యలో వినియోగదారులు ఒకేసారి ప్రవేశించినా సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. తత్కాల్ టికెట్ల బుకింగ్ మరింత వేగంగా పూర్తయ్యేలా మార్పులు చేశారు. ప్రయాణికులు తమకు కావాల్సిన సీట్లను ఎంపిక చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పించారు. వినియోగదారులకు సులభంగా అర్థమయ్యే విధంగా కొత్త రూపకల్పనతో వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నారు. నావిగేషన్, టికెట్ శోధన, బుకింగ్ ప్రక్రియలను మరింత సౌకర్యవంతంగా మార్చనున్నారు. ప్రస్తుతం రైలు ప్రయాణికుల్లో దాదాపు 88 శాతం మంది ఆన్‌లైన్ ద్వారానే టికెట్లు బుక్ చేసుకుంటున్న నేపథ్యంలో ఈ మార్పులు చేపట్టారు. ముఖ్యంగా తత్కాల్ బుకింగ్ సమయంలో టికెట్లు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రయాణికుల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో రైల్వే శాఖ కొత్త రిజర్వేషన్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. టికెట్ బుకింగ్ సమయంలో సర్వర్ స్పందన వేగాన్ని గణనీయంగా పెంచేలా సాంకేతిక మార్పులు చేపట్టింది. లాగిన్ సమయంలో, చెల్లింపుల ధృవీకరణ సమయంలో వచ్చే ఓటీపీలు ఆలస్యంగా అందడం వల్ల కూడా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త వెబ్‌సైట్‌లో ఈ ప్రక్రియలను వేగవంతం చేసి, తక్షణ ధృవీకరణ సదుపాయాలు అందించనున్నారు. జైపూర్‌లోని మాలవీయ జాతీయ సాంకేతిక విద్యాసంస్థలో విద్యార్థులతో జరిగిన సమావేశంలో అశ్విని వైష్ణవ్ ఈ విషయాలను వెల్లడించారు. ప్రయాణికులకు మెరుగైన అనుభవం అందించడమే లక్ష్యంగా ఈ కొత్త వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# పసిడి ధరలకు రెక్కలు

హైదరాబాద్, జూన్ 15



అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరి పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టినప్పటికీ, దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పాటు పెట్టుబడిదారుల కొనుగోళ్లు పెరగడంతో పసిడి ధరలు ఎగబాకినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గుడ్ రిటర్న్స్ గణాంకాల ప్రకారం, నేడు దేశవ్యాప్తంగా 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర గత ముగింపుతో పోలిస్తే రూ.2,450 పెరిగి సగటున రూ.1,51,530కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.2,250 పెరిగి రూ.1,38,900గా నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.1,840 పెరిగి రూ.1,13,650కు చేరింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఉదయం 10 గంటల సమయానికి 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,530గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,900కు చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల్లో కూడా దాదాపు ఇదే స్థాయిలో ధరలు నమోదయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు కూడా భారీగా పెరిగాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,490గా నమోదవగా, న్యూఢిల్లీలో రూ.1,51,680కు చేరింది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,530గా ఉంది.

# వేదాంత డీమర్జర్ పూర్తి.. ఐదు కంపెనీల షేర్ల ట్రేడింగ్ ప్రారంభం

ముంబై, జూన్ 15




గనులు, లోహాలు, ఇంధన రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ వేదాంత గ్రూప్ డీమర్జర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తైంది. విభజన అనంతరం ఏర్పడిన నాలుగు కొత్త కంపెనీల షేర్లు సోమవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడింగ్ ప్రారంభించాయి. దీంతో వేదాంత గ్రూప్‌కు చెందిన మొత్తం ఐదు కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్‌కు అందుబాటులోకి వచ్చాయి. వేదాంతా లిమిటెడ్‌తో పాటు వేదాంతా అల్యూమినియం మెటల్స్, వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంతా పవర్, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీల షేర్లు మార్కెట్లో అరంగేట్రం చేశాయి. వీటిలో వేదాంతా అల్యూమినియం మెటల్స్ షేర్ బీఎస్‌ఈలో రూ.527 వద్ద ట్రేడింగ్ ప్రారంభించి, రోజులో రూ.538 గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో ఆ సంస్థ మార్కెట్ విలువ సుమారు రూ.1.95 లక్షల కోట్లకు చేరుకుంది. వేదాంతా పవర్ షేర్ రూ.41.30 వద్ద లిస్టయి, సంస్థ మార్కెట్ విలువ రూ.16,736 కోట్లకు చేరింది. వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్ సంస్థ మార్కెట్ విలువ రూ.14,487 కోట్లుగా నమోదవగా, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్ సంస్థ మార్కెట్ విలువ రూ.8,231 కోట్లకు చేరింది. డీమర్జర్ పథకం ప్రకారం మే 1ను రికార్డు తేదీగా నిర్ణయించారు. ఆ తేదీ నాటికి వేదాంతా లిమిటెడ్ షేర్లు కలిగి ఉన్న ప్రతి పెట్టుబడిదారుడికి కొత్తగా ఏర్పడిన నాలుగు కంపెనీల్లో ఒక్కో షేర్ కేటాయించారు. అంటే ఒక వేదాంతా షేర్ కలిగి ఉన్న పెట్టుబడిదారుడికి అదనంగా నాలుగు కొత్త కంపెనీల్లో ఒక్కో షేర్ చొప్పున లభించింది.



## డాలర్‌పై రూపాయి
# దూకుడు

ముంబై, జూన్ 15

అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న కీలక పరిణామాల ప్రభావంతో భారత రూపాయి నేడు అమెరికా డాలర్‌తో పోలిస్తే గణనీయంగా బలపడింది. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందన్న వార్తలతో ముడి చమురు ధరలు భారీగా పడిపోవడంతో రూపాయి ఒకేరోజు 58 పైసలు లాభపడింది. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి 94.70 వద్ద ట్రేడింగ్ ప్రారంభించి, అనంతరం మరింత బలపడి 94.60 స్థాయి కి చేరుకుంది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.18 వద్ద ముగిసింది. అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన శాంతి ఒప్పం దం ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో సానుకూల సంకేతాలను పంపింది. ఇరాన్‌తో ఒప్పందం పూర్తయిం దని, వ్యూహా త్మక ప్రాధాన్యం కలిగిన హర్మూజ్ జలసంధి తిరిగి తెరు చుకునే అవకాశముందని ఆయన వెల్లడించా రు. ప్రపంచ ముడి చమురు రవాణాలో కీలకమైన ఈ జలమా ర్గం మళ్లీ అందుబాటులోకి రానుండటంతో సర ఫరాపై నెల కొన్న ఆందోళనలు తగ్గాయి. ఈ పరిణామాల ప్రభా వంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా క్షీణించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర దాదాపు ఐదు శాతం పడిపోయి 83 డాలర్లకు చేరుకోగా, అమెరికా ముడి చమురు ధర కూడా ఐదు శాతానికి పైగా తగ్గి 80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ముడి చమురు ధరల తగ్గుదల భారత్‌కు అనుకూలంగా మారిందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

## హోండా కార్లపై భారీ
# తగ్గింపులు

న్యూఢిల్లీ, జూన్ 15

కొత్త కారు కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు హోండా సంస్థ ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. జూన్ నెలకు గాను పలు ప్రముఖ మోడళ్లపై నగదు తగ్గింపులు, వాహన మార్పిడి బోనస్‌లు, విశ్వసనీయ కస్టమర్ ప్రయోజనాలు, పొడిగించిన వారంటీ వంటి ప్రత్యేక సదుపాయాలను అందిస్తోంది. ఈ ఆఫర్లు జూన్ 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. హోండా శ్రేణిలో అత్యధిక ప్రయోజనాలు ఎలివేట్ క్రీడోపయోగ వాహనంపై లభిస్తున్నాయి. ఎలివేట్ జెడ్ఎక్స్ మాన్యువల్, జెడ్ఎక్స్ ఆటోమేటిక్ వేరియంట్లపై గరిష్ఠంగా రూ.2.15 లక్షల వరకు ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. నగదు తగ్గింపులతో పాటు వాహన మార్పిడి బోనస్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి. కొన్ని ఎంపిక చేసిన వేరియంట్లకు 360 డిగ్రీల కెమెరా, ప్రీమియం డ్యాష్‌క్యామ్, ప్రత్యేక ఉపకరణాల ప్యాకేజీలను ఉచితంగా అందిస్తున్నారు. ఎలివేట్ వి అపెక్స్ వేరియంట్‌పై రూ.1.61 లక్షల వరకు, వీఎక్స్ వేరియంట్‌పై రూ.1.53 లక్షల వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. కాంపాక్ట్ సెడాన్ విభాగంలో మంచి ఆదరణ పొందుతున్న అమేజ్ మోడల్‌పైనా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి.




# ద్విచక్ర వాహనాల అమ్మకాల్లో ఢిల్లీ అగ్రస్థానం

న్యూఢిల్లీ, జూన్ 15




దేశంలో ద్విచక్ర వాహనాల మార్కెట్ జోరు కొనసాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 2.14 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు అమ్ముడవగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ అదే ఊపు కనిపిస్తోంది. మే నెల అమ్మకాల గణాంకాలు బైక్‌లు, స్కూటర్లకు దేశవ్యాప్తంగా బలమైన డిమాండ్ కొనసాగుతున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. తాజా గణాంకాల ప్రకారం 2026 మే నెలలో అత్యధిక ద్విచక్ర వాహనాల అమ్మకాలు నమోదైన నగరంగా ఢిల్లీ నిలిచింది. అక్కడ 46,197 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా, 41,717 యూనిట్లతో బెంగళూరు రెండో స్థానంలో నిలిచింది. హైదరాబాద్ 33,010 వాహనాల అమ్మకాలతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. అగ్ర ఐదు నగరాల జాబితాలో చెన్నై, పుణే కూడా చోటు సంపాదించాయి. చెన్నైలో 27,883 వాహనాలు, పుణేలో 26,941 వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ముం బై, అహ్మదాబాద్, జైపూర్, లక్నో, సూరత్ నగరాలు కూడా తొలి పది స్థానా ల్లో నిలిచాయి. మార్కెట్ వాటా పరంగా చూస్తే మోటార్ సైకి ళ్లదే ఆధిపత్యం కొనసాగు తోంది. మొత్తం ద్విచక్ర వా హనాల రిజిస్ట్రేషన్లలో 59.4 శాతం వాటా బైక్‌లదే కాగా, స్కూటర్ల వాటా 30.2 శాతంగా నమోదైంది. విద్యుత్ ఆధారిత స్కూటర్ల ప్రాధాన్యం క్రమంగా పెరుగుతూ 8.8 శాతం మార్కెట్ వాటాను సాధించింది. అయితే విద్యుత్ బైక్‌ల వాటా ఇంకా 0.1 శాతానికే పరి మితమైంది. రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే ఉత్తరప్రదేశ్ అగ్ర స్థానంలో నిలిచింది. మే నెలలో అక్కడ సుమారు 3.14 లక్షల ద్విచక్ర వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి.



## వృద్ధిని తేలిగ్గా
## తీసుకోవద్దు: నిర్మలా

న్యూఢిల్లీ, జూన్ 15

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం సంతృప్తికరంగా రాణిస్తున్నప్పటికీ, ఈ వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హెచ్చరించారు. దీర్ఘకాలికంగా అభివృద్ధి కొనసాగాలంటే నిరంతర ఆవిష్కరణలు, సంస్కరణలు, వ్యవస్థల బలోపేతం అత్యంత అవసరమని ఆమె స్పష్టం చేశారు. 'మైండ్‌మైన్ సమ్మిట్-2026'లో పాల్గొన్న నిర్మలా సీతారామన్ దేశ ఆర్థిక పరిస్థితులపై మాట్లాడారు. భారతదేశం ఆర్థికంగా మంచి పురోగతి సాధిస్తున్నప్పటికీ, పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా ఎక్కడ మెరుగుదలకు అవకాశం ఉందో గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కేవలం ఆర్థిక వృద్ధి రేటు పెరగడం మాత్రమే సరిపోదని, స్థిరమైన మరియు సమ్మిళిత అభివృద్ధి కోసం బలమైన సంస్థలు, సమర్థవంతమైన విధానాలు, పటిష్ఠమైన మద్దతు వ్యవస్థలు అవసరమని పేర్కొన్నారు. భారతదేశం వంటి విస్తృతమైన, సంక్లిష్ట ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని కొనసాగించాలంటే సామర్థ్యాలను పెంపొందించడం, ఉత్పాదకతను మెరుగుపరచడం, అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా చూడడం అత్యవసరమన్నారు. పురోగతి సహజంగా వస్తుందని భావించడం సరైంది కాదని, వృద్ధి వేగాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతర కృషి, కొత్త ఆలోచనలు, సంస్కరణలు తప్పనిసరని ఆమె అభిప్రాయపడ్డారు. వివిధ రంగాలు ప్రస్తుతం మంచి పనితీరు కనబరుస్తున్నప్పటికీ, ముఖ్యంగా మధ్యంతర ఉత్పత్తులు, సంక్లిష్ట తయారీ రంగాలు, సేవల రంగాలకు ఇంకా విధానపరమైన మద్దతు అవసరమని అంగీకరించారు.




## ఆన్‌లైన్
## మోసాలతో ఏటా
## వేల కోట్ల నష్టం


న్యూఢిల్లీ, జూన్ 15

దేశంలో ఇ-వాణిజ్య రంగం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ఆన్‌లైన్ వేదికలు అనుసరిస్తున్న మోసపూరిత డిజిటల్ విధానాల కారణంగా వినియోగదారులు భారీగా ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. 'డేటమ్ ఇంటెలిజెన్స్' విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఈ తరహా తప్పుడు విధానాల వల్ల భారతీయ వినియోగదారులు ఏటా రూ.25 వేల కోట్ల నుంచి రూ.28 వేల కోట్ల వరకు నష్టపోతున్నారు. దేశంలోని సుమారు 30.4 కోట్ల మంది డిజిటల్ వినియోగదారుల్లో దాదాపు 88 శాతం మంది దాచిపెట్టిన రుసుములు, బలవంతపు కొనుగోళ్లు, చివరి దశలో అదనపు చార్జీలు జోడించడం వంటి పద్ధతుల కారణంగా ప్రతి నెలా సగటున రూ.78 నుంచి రూ.87 వరకు నష్టపోతున్నట్లు నివేదిక పేర్కొంది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ ఈ ఏడాది జనవరిలో పలు సంస్థలపై రూ.44 లక్షల జరిమానాలు విధించినప్పటికీ, 73 శాతం ఆన్‌లైన్ వేదికలు ఇప్పటికీ వినియోగదారులను ఒత్తిడికి గురిచేసే వ్యాపార విధానాలను కొనసాగిస్తున్నాయని అధ్యయనం వెల్లడించింది. అలాగే 69 శాతం సంస్థలు కొనుగోలు చివరి దశలో అదనపు చార్జీలు జోడించే విధానాన్ని అనుసరిస్తున్నట్లు తేలింది. వినియోగదారుల విశ్వాసం విషయంలో ప్రముఖ ఆన్‌లైన్ వాణిజ్య సంస్థ అమెజాన్ అగ్రస్థానంలో నిలిచింది. సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది వినియోగదారులు అమెజాన్‌ను అత్యంత విశ్వసనీయ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు ఫ్లిప్‌కార్ట్, మింత్రా, నైకా వంటి సంస్థలపై వినియోగదారుల్లో ప్రతికూల అభిప్రాయం ఎక్కువగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

## రూ. 300 కోట్ల క్లబ్‌లో పెద్ది రెండో వారంలోనూ జోరు

**హైదరాబాద్, జూన్ 15**

మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన క్రీడా నేపథ్య యాక్షన్ చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. తొలి వారం తర్వాత సాధారణ రోజుల్లో కొంత మందగించిన వసూళ్లు, రెండో వారాంతంలో మళ్లీ ఊపందుకున్నాయి. వ్యాపార వర్గాల అంచనాల ప్రకారం విడుదలైన 11వ రోజు ఆదివారం ఈ చిత్రం దేశవ్యాప్తంగా సుమారు 4,133 ప్రదర్శనల ద్వారా రూ. 9.20 కోట్ల నికర వసూళ్లు సాధించింది. దీంతో భారతీయ బాక్సాఫీస్ వద్ద 11 రోజుల్లో మొత్తం రూ. 216 కోట్ల నికర వసూళ్లు, రూ. 256.23 కోట్ల స్థూల వసూళ్లు నమోదు చేసినట్లు సమాచారం. విదేశీ మార్కెట్లలో కూడా 'పెద్ది'కు విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు విదేశాల్లో సుమారు రూ. 51.75 కోట్ల స్థూల వసూళ్లు రాబట్టినట్లు సినీ వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.




## సినిమాలు మానేద్దాం అనుకున్నా..

**హైదరాబాద్ - 15-06-2026 -**

అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరోయిన్ నివేదా పేతురాజ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఆమె, ఇటీవల జరిగిన 'సింగ్ గీతం' సక్సెస్ మీట్‌లో పాల్గొని తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌లో ఎదుర్కొన్న కష్టకాలం గురించి భావోద్వేగంగా మాట్లాడారు. ఈ సందర్భంగా నివేదా మాట్లాడుతూ.. "2023లో నేను సినిమాలు పూర్తిగా మానేయాలని అనుకున్నాను. నా జీవితం తప్పుడు దారుల్లో వెళ్తోందని, కొన్ని తప్పు నిర్ణయాలు తీసుకున్నానని అప్పట్లో అనిపించింది. ఆ సమయంలో నేను చాలా కన్ఫ్యూజన్‌లో ఉన్నాను" అని వెల్లడించారు. అయితే 'సింగ్ గీతం' తన జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని నివేదా చెప్పారు. "ఈ సినిమా నాకు కొత్త జీవితాన్ని ఇచ్చింది. నాగ్ అశ్విన్ లేకపోతే ఈ రోజు నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు. బహుశా హిమాలయాల్లో ధ్యానం చేసుకుంటూ ఉండేదాన్ని. ఈ సినిమా మంచి ఫలితం ఇస్తుందని ముందే నమ్మాను. సినిమా చూసిన తర్వాత భావోద్వేగానికి లోనై ఏడ్చాను" అని తెలిపారు. నివేదా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ముఖ్యంగా "తప్పు నిర్ణయాలు తీసుకున్నాను", "సినిమాలు మానేద్దాం అనుకున్నాను", "హిమాలయాలకు వెళ్లిపోదాం అనిపించింది" వంటి వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాలకు సంబంధించినవేనా అనే సందేహాలను అభిమానుల్లో రేకెత్తిస్తున్నాయి.





## పారితోషికం పెంచిన త్రిష

**చెన్నై, జూన్ 15**

దక్షిణ భారత సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలకు పైగా తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్న ప్రముఖ నటి త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల వరుస విజయాలతో తన కెరీర్‌ను మళ్లీ గాడిలో పెట్టుకున్న ఈ స్టార్ నటి, కొత్త చిత్రాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఒకప్పుడు అగ్ర కథానాయికగా వెలుగొందిన త్రిష, విజయాలు--పరాజయాలను సమానంగా ఎదుర్కొంటూ ప్రతి దశలోనూ తన స్థానాన్ని కాపాడుకుంటూ వచ్చారు. అందుకే ఆమెను దక్షిణాది చిత్రసీమలో అత్యంత నిలకడగా కొనసాగుతున్న కథానాయికల్లో ఒకరిగా పరిగణిస్తున్నారు. ఇటీవలి కాలంలో కొన్ని చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, తాజాగా విడుదలైన 'కరుప్పు' చిత్రం ఘన విజయం సాధించడంతో త్రిష మార్కెట్ మళ్లీ బలపడిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో స్వర్ణయుగం ప్రారంభమైనట్లు కనిపిస్తోంది. ప్రముఖ హీరోల సరసన అవకాశాలు దక్కడం, దేశవ్యాప్తంగా గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ కొనసాగడం వంటి అంశాలు ఆమెకు మరింత బలం చేకూరుస్తున్నాయి. యువ కథానాయికల నుంచి తీవ్ర పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటనా ప్రతిభ, తెరపై ఆకట్టుకునే హావభావాలతో త్రిష ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు. 'కరుప్పు' విజయానంతరం తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రూపొందనున్న పలు చిత్రాల కోసం త్రిషను సంప్రదిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆమె తన పారితోషికాన్ని పెంచినట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కొన్ని నివేదికల ప్రకారం, తాజాగా ఓ ద్విభాషా చిత్రానికి భారీ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

## ప్రజలపై వ్యాఖ్యలు చేయలేదు: రాఘవ లారెన్స్

**చెన్నై, జూన్ 15**


ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్‌పై ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలోకి వచ్చిన వివాదానికి ఆయన స్పష్టత ఇచ్చారు. ప్రజలను కుక్కలతో పోల్చారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, తన మాటలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాజకీయాల్లోకి ప్రవేశించే ఆలోచనలో ఉన్నట్లు ప్రకటించిన రాఘవ లారెన్స్, అభిమానులు మరియు ప్రజలు అంగీకరిస్తేనే రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తానని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశానికి సంబంధించిన ఒక చిన్న వీడియో భాగం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అందులో ప్రజలను కించపరిచేలా మాట్లాడినట్లు కొందరు ఆరోపణలు చేయడంతో వివాదం చెలరేగింది. ఈ ఆరోపణలపై స్పందించిన రాఘవ లారెన్స్, ప్రజలు మరియు అభిమానులను తాను ఎప్పుడూ తల్లితో సమానంగా భావిస్తానని పేర్కొన్నారు. అలాంటి తాను ప్రజలను కుక్కలతో పోల్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



## బుల్లితెర నటి మృతి

**ముంబై, జూన్ 15**

బుల్లితెర నటి సంచితా ఉగాలే మృతి చెందిన ఘటన సినీ, టెలివిజన్ వర్గాల్లో విషాదాన్ని నింపింది. ప్రముఖ ధారావాహిక లికుంకుమ్ భాగ్యలిలో నటించి గుర్తింపు పొందిన సంచితా ఉగాలే వయసు 22 సంవత్సరాలు. ఆమె మరణవార్తతో అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పోలీసుల సమాచారం ప్రకారం, ముంబైలోని నలాసోపారా ప్రాంతంలో తల్లి దండ్రులు, సోదరితో కలిసి నివసిస్తున్న సంచి తా, ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యు లు ఇంటికి చేరుకున్న అనంతరం ఆమె అపస్మారక స్థితిలో కనిపించడంతో వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నప్పటికీ, ఘటనకు దారితీసిన కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రమాదవశాత్తు మరణంగా నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సమాచారం. సంచి తా ఉగాలే బుల్లితెరపై తన నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. కుంకుమ్ భాగ్య ధారావాహికతో పాటు పలు ప్రాజెక్టు ల్లో నటించి ప్రేక్షకుల ఆదరణ పొందింది.





## బాషా స్ఫూర్తితో మా ఇంటి బంగారం అసలు ఈ కథ సాయి పల్లవి కోసమేనా?

**హైదరాబాద్ -- 15-06-2026 --**

హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'మా ఇంటి బంగారం'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా ఈ సినిమా కథ వెనుక ఉన్న ఆసక్తికర విషయాలను దర్శకురాలు నందిని రెడ్డి వెల్లడించడంతో మూవీ మరింత చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన ప్రమోషనల్ కార్యక్రమంలో నందిని రెడ్డి మాట్లాడుతూ, సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన కల్ట్ క్లాసిక్ 'బాషా' చిత్రంలోని కథా నిర్మాణం నుంచి ప్రేరణ పొందినట్లు తెలిపారు. అయితే అదే కథను కాపీ చేయకుండా, మహిళా ప్రధాన పాత్రను కేంద్రంగా చేసుకుని పూర్తిగా కొత్త కోణంలో ఈ చిత్రాన్ని రూపొందించామని చెప్పారు. "'బాషా'లో హీరోకు ఒక రహస్యమైన గతం ఉంటుంది. అదే తరహా టెంప్లేట్‌ను తీసుకుని, ఒక మహిళ అలాంటి పరిస్థితిలో ఉంటే ఎలా ఉంటుందనే ఆలోచనతో కథను సిద్ధం చేశాం. ఆధునిక ప్రేక్షకులకు నచ్చేలా అనేక మార్పులు చేసి కొత్తగా చూపించేందుకు ప్రయత్నించాం" అని నందిని రెడ్డి వెల్లడించారు. ఇదిలా ఉంటే, ఈ సినిమా మొదట సమంత కోసం కాకుండా సాయి పల్లవిని దృష్టిలో పెట్టుకుని రాసిన కథ అనే విషయం కూడా బయటకు వచ్చింది. ఇటీవల విడుదల చేసిన వీడియోలో సమంత ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, నందిని రెడ్డి తొలుత సాయి పల్లవి కోసం ఈ కథను సిద్ధం చేశారని చెప్పారు. అయితే అప్పట్లో ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో సాయి పల్లవి ఈ చిత్రాన్ని చేయలేకపోయిందని, అనంతరం కథను తనకు అనుగుణంగా మార్పులు చేసి తెరకెక్కించారని వెల్లడించారు.



## అనిల్ కొత్త మల్టీస్టారర్‌పై ఆసక్తి

**హైదరాబాద్, జూన్ 15**

వరుస విజయాలతో టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేస్తున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో భారీ మల్టీస్టారర్ చిత్రానికి సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కుటుంబ ప్రేక్షకులను అలరించే కథలతో పాటు వినోదాత్మక చిత్రాలను అందిస్తూ విజయవంతమైన దర్శకుడిగా గుర్తింపు పొందిన అనిల్ రావిపూడి, ప్రస్తుతం విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి ఓ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే వెంకటేష్‌తో రూపొందించిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలు ఘనవిజయాలు సాధించగా, కళ్యాణ్ రామ్‌తో చేసిన తొలి చిత్రం 'పటాస్' కూడా సూపర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ ఇద్దరు హీరోలను ఒకే చిత్రంలో చూపించబోతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాలు పూర్తికాగా, చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. పూర్తిస్థాయి యాక్షన్‌తో పాటు కుటుంబ భావోద్వేగాలు, వినోదం మేళవించిన కథతో ఈ చిత్రం రూపొందనుందని తెలుస్తోంది. 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో చిత్రబృందం పనులు కొనసాగిస్తున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే సమయంలో ఈ చిత్రానికి 'సంక్రాంతి సరుకు' అనే పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించే ఈ పేరు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే చిత్ర శీర్షికపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇక ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'సింగీతం' విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశంగా మారాయి.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467